క్లుప్తంగా

నిధుల మంజూరు హర్షణీయం


కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

మాడ్గుల: మండల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి కతజ్ఞతలు తెలియజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో వివిధ పాఠశాలల అభివృద్ధికి రూ.10కోట్లు, మాడ్గుల గ్రామానికి రూ.5కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి సొంత మండలం మాడ్గులకు పెద్ద ఎత్తున నిధుల మంజురు చేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో విజయ డైయిరీ చైర్మన్ సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా రాయి

నిలిపోయిన రాకపోకలు


రోడ్డు మధ్యలో పడిన రాయి

యాచారం: కొత్తపల్లి–కొత్తపల్లి తండాల మధ్యన రోడ్డుపై ఆదివారం రాత్రి ఓ పెద్దరాయి పడింది. కొద్ది రోజులుగా రోడ్డు మరమ్మతులు పనులు చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భూమి తడిసి రాయి కదిలి రోడ్డుపై పడింది. రోడ్డు మధ్యలో రాయి పడడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. ఈ రహదారిపై నడిచే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన హైమద్ జానీ కూతురు సనా హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. చదువు, హాస్టల్ వసతి ఖర్చుల నిమిత్తం, సోమవారం యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థినికి భవిష్యత్తులో ఏ అవసరమున్నా ఆర్థిక తోడ్పాటునందించి, ఉన్నత విద్యను అభ్యసించేందుకు కృషి చేస్తామన్నారు.

కార్యదర్శులకు సన్మానం


కార్యదర్శులను సన్మానించిన గ్రామస్తులు

కడ్తాల్: మండలంలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ బదిలీపై వెళ్తుండటంతో గ్రామస్తులు సోమవారం పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజశేఖర్‌గౌడ్ 3 సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిచాడని అన్నారు. అదేవిధంగా నూతనంగా పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, నాయకులు దామోదర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్‌యాదవ్, జంగయ్య, అంజయ్యయాదవ్, పవన్‌కుమార్ రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి గ్రామస్తులు ఉన్నారు.

వాసవీనగర్ కాలనీ కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్‌లోని వాసవీనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలకృష్ణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి, కోశాధికారి వంశీ, సంయుక్త కార్యదర్శి బంగారయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివశంకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గోపి, లింగారెడ్డి, జంగాచారి, అంజయ్య, ప్రశాంత్, లోకేష్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డిలను ఎన్నుకున్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొర్ర జ్ఞానేశ్వర్‌ను మండల ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘాల అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రాజు, మహేందర్‌ముదిరాజ్, రాంచందర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

తలకొండపల్లి: గత 9 నెలల నుంచి వేతనాలు రాక పంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో నేడు (మంగళవారం) చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం మండల కేంద్రంలో గట్టు ఇప్పలపల్లి కార్మికులతో కలిసి భిక్షాటన చేశారు. పెంటయ్య మాట్లాడుతూ.. గత ఏడాది ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. ఫలితంగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులూ విడుదల కాలేదన్నారు. దీంతో కార్మికుల జీతాల విషయంలో పంచాయతీలు చెతులెత్తేశాయని పేర్కొన్నారు. జనవరిలో పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పాలకవర్గాలు లేవనే కారణంతో ఫిబ్రవరి నుంచి కేంద్రం నిధులివ్వడం లేదని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేస్తూ, ఫండింగ్ వేతనాలు మంజూరు చేయాలని, జీఓ నంబర్ 50 రద్దు, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం, కారోబార్‌కు బిల్ కలెక్టర్ ప్రత్యేక హోదా కల్పించాలనే డిమాండ్లతో చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని ఆయన కోరారు.


భిక్షాటన చేస్తున్న పెంటయ్య, తదితరులు

కల్వకుర్తిపై అభిమానం చాటుకున్న సీఎం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిమానం చాటుకున్నారని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభ్యర్థన మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిధులను మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. దివంగత కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి కల్వకుర్తి నియోజక అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా కల్వకుర్తి వచ్చి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ చేయడం సంతోషదాయకమన్నారు. ప్రజలు ఆశించిన దానికంటే మిన్నగా కల్వకుర్తి అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో కల్వకుర్తి అన్ని రంగాలలో అభివృద్ధి చెంది ఆదర్శ నియోజకవర్గంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం

ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ నాయకుడు దాస్‌రాంనాయక్

తలకొండపల్లి: భారతదేశ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవితం దేశ ప్రజలందరికీ ఆదర్శమని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ నాయకులు దాస్‌రాంనాయక్ కొనియాడారు. అంబేడ్కర్ పూలే జ్ఞాన జాతర వ్యవస్థాపకులు జి.సుధాకర్, డీబీఎస్‌యూ, రైతు సంఘం నాయకులు వెంకటయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి అంబేడ్కర్ జీవిత విశేషాలను తెలుపుతూ నాటికను ప్రదర్శించారు. దాస్‌రాంనాయక్, దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్ బహదూర్‌లు ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు. అణగారిన బహుజనుల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహానీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఎన్నో ఉన్నత చదువులు చదివి అనేక శాస్త్ర, విజ్ఞానంలో అపారమైన జ్ఞానాన్ని సంపాదించిన ప్రపంచ మేధావి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభ్యుదయ కళా మండలి వారు అంబేడ్కర్ జీవిత విశేషాలను తమ కళ్లకుగట్టినట్లుగా ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ పూలే జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు శంకర్, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రమేష్, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, మోహన్‌రెడ్డి, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లిలో అంబేడ్కర్ నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

మురుగుతో అవస్థలు

- రోడ్డుపై నిలుస్తున్న మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని తుక్కుగూడ రావిర్యాల రోడ్డు దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రోడ్డులో గత కొద్ది రోజుల నుంచి మురుగునీరు నిల్వ ఉండటమే ఇందుకు కారణం. సర్దార్‌నగర్‌కు చెందిన మురుగునీరు రావిర్యాల పెద్ద చెరువులోకి వదలడానికి గతంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పైపులైన్ నిర్మాణం చెరువు వాగు వరకు పూర్తి చేయలేదు. మధ్యలో వదిలివేశారు. దీంతో మురుగునీరు రోడ్డుపై నిలుస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం మరింత పెరిగింది. దీంతో ఇక్కడి ప్రయాణికులు, స్థానిక రైతులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వాగు వరకు పైపులైన్ వేయాలని స్థానికులు డిమాండ్ కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి

- కౌన్సిలర్ శాంతమ్మ

షాద్‌నగర్: వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తునట్లు కౌన్సిలర్ శాంతమ్మ తెలిపారు. సోమవారం పట్టణంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కాలనీలో ప్రజలకు విద్యుద్దీపాలు, డ్రైనేజీలు, మంచినీరు, సీసీ రోడ్ల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు శైలజ, సుధీర్, శ్రీనివాస్ రెడ్డి, యూసుఫ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేష్, రాఘవేందర్, కాటసుధీర్, కార్తీక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్

ఆషాఢ బోనం.. ఘనంగా సమర్పణం


మొయినాబాద్: సురంగల్‌లో కట్టమైసమ్మ బోనాల ఊరేగింపు

చేవెళ్ల/మొయినాబాద్: ఆషాఢ బోనాల ఉత్సవాలు పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా కొనసాగాయి. మండలంలోని సురంగల్, శ్రీరాంనగర్ తదితర గ్రామాల్లో మైసమ్మ బోనాల ఊరేగింపులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పుల చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపులు చేపట్టారు. మహిళలు బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయా గ్రామాల్లో యువకులు తొట్టెల ఊరేగింపులు చేపట్టారు. ఉత్సవాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

హైతాబాద్‌లో బోనాల సందడి

షాబాద్: మండలంలోని హైతాబాద్ గ్రామంలో సోమవారం ఘనంగా బోనాలు నిర్వహించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

ఆమనగల్లు: రైతుబీమా పథకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబీమా కోసం 28 జూన్ 2024 నాటికి పట్టాదారుపాసుపుస్తకాలు అందుకున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండి 59 సంవత్సరాల వయసు లోపు ఉన్న రైతులు రైతుబీమాకు అర్హులన్నారు. పథకం కోసం రైతు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు అలాగే నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో స్వయంగా వచ్చి వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం


మొరం పోసి చదును చేయిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కందుకూరు: మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారిపై మొరం పోసి తాత్కాలికంగా సమస్యను పరిష్కారించారు. స్కూల్‌కు వెళ్లే రహదారి వర్షాలతో బురదమయంగా మారి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మాజీ సర్పంచ్ సోమవారం గ్రామస్తులతో కలిసి ఆ రహదారిపై మొరం పోయించి డోజర్‌తో చదును చేయించాడు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీల సమస్యలపై మాట్లాడండి


సబితారెడ్డిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం నగరంలోని ఆమె నివాసంలో కలిసి పలు సమస్యలపై విన్నవించారు. అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందేలా చూడాలని, దళి తబంధు పథకం అమలు చేసేలా అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద నరసింహ, బీఆర్ఎస్ నాయకులు యాదన్న పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మహేశ్వరం: మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉదయం శివపార్వతులకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు శివలింగానికి పంచామృతాభిషేకం పలు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త నజీర్‌లు భక్తులకు అన్నదానం చేశారు. శివగంగ రాజరాజేశ్వర ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కేఎల్లార్ పేర్కొన్నారు. అతి పూరాతన శివాలయం మహేశ్వరం మండల కేంద్రంలో కొలువుతీరడం అదృష్టమన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించడం మంచి కార్యక్రమమని, తాను కూడా సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లెకుమార్, నాయకులు యాదయ్య,శ్రీకాంత్, శంకర్,ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

31 వరకు వరి నారుమళ్లు పోసుకోండి

ఏఓ రాజు

తలకొండపల్లి: 31 వరకు స్వల్పకాలిక వరి నారుమళ్లు పోసుకోవడానికి అనువైన సమయమని మండల వ్యవసాయాధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30, 25 రోజుల వయస్సు ఉన్న మధ్యకాలిక, స్వల్పకాలిక వరి రకాలను నాట్లుకోవాలని తెలిపారు. దీర్ఘకాలిక వరిరకాల నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటినప్పుడు ఆకు కొనలు తుంచి, కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటాలన్నారు. నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25 శాతం పెంచి మూడు దఫాలుగా, లేక రెండు దఫాలుగా అంటే 70 శాతం నాటే సమయంలో మిగతా 30 శాతం అంకురం దశలో వేసుకోవాలని వివరించారు. వరినాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికల ఇసుకలో కలిపి చల్లినట్లయితే ప్రధాన పొలంలో పంటను 15–20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. నాటు పెట్టిన తర్వాత ప్రతిసారి 2 మీటర్లకు కాలిబాటను తీయటం వలన గాలి వెలుతురూ బాగా ప్రసరించడంతో పాటు సుడి దోమను నివారించవచ్చన్నారు. 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి నాటిన 10,15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు ఉల్లికోడ్‌ను నివారించుకోచవ్చని ఏఓ రైతులకు సూచించారు.

కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారితో సుంకిరెడ్డి

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెల్దండలోని సీకెఆర్ ఫంక్షన్ హాలులో 11 రోజుల పాటు నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 11 రోజుల పాటు నిర్వహించిన కంటి వైద్య శిబిరం సోమవారం ముగిసింది. శంకర నేత్రాలయ సహకారంతో కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల కోసం వెల్దండలోని సీకెఆర్ ఫంక్షన్‌హాలులో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 2500 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 165 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. 1600 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల కోసం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. అనంతరం ఆయన పలువురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, రమేశ్‌నాయక్, కొండల్, యూసుఫ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

పదవుల కోసం తీవ్ర పోటీ

- ఆశావహుల నుంచి అభిప్రాయల సేకరణ
- మండల పార్టీ అధ్యక్షుడిగా 14 మంది పోటీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం 8 మంది
- వచ్చే నెల 4 వరకు ఎంపిక చేస్తామని ముఖ్యనాయకుల హామీ


సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక అంశంపై సోమవారం కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త నజీర్‌లతో సమావేశమయ్యారు. ఆశావహులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, ప్రశాంత్‌రెడ్డి, మురళిధర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, బాల్‌రాజ్, ప్రభునాయక్, సురేందర్‌రెడ్డి, నర్సింహ, అంజయ్య, రాజు, ప్రవీణ్, రాజు, రవీందర్‌నాయక్‌లు తమకు పార్టీ మండల అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీకి ఆశావహులు

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీ జనరల్‌కు ప్రభుత్వం ఇటీవల రిజర్వు చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పదవీ తమకు ఇవ్వాలని ఆశావహులు పోటీ పడుతున్నారు. ఆశావహుల్లో నేనావత్ రాజునాయక్, అంగోత్ కృష్ణానాయక్, గంగారం పాండు నాయక్, విఠల్‌నాయక్, సేవ్యానాయక్, గోపాల్‌నాయక్, హరిసింగ్, రవీందర్ నాయక్‌లు తమ అభిప్రాయాన్ని ముఖ్యనేతల ముందు వ్యక్తం చేశారు. పోటీ పడుతున్న వారితో పాటు గ్రామ, మండల ముఖ్యనాయకుల అభిప్రాయాలను తీసుకొని అన్ని విధాలుగా అర్హతులున్న సమర్థవంతమైన వారిని పార్టీ మండల అధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ వచ్చే నెల 4వ తేదీ వరకు పూర్తవుతుందని స్పష్టం చేశారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

గ్రామస్తుల అభ్యర్థనకు స్పందించిన డీఎం


డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండలంలోని ఆలూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలోని మెహిదీపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మూర్తి గ్రామానికి గతంలో వచ్చే బస్సును పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బస్సు గత కొన్ని రోజులుగా రాకపోవటంతో గ్రామస్తులకు ఇబ్బందిగా ఉందని ఇటీవల కొంతమంది నాయకులు డీఎంకు వినతిపత్రం ఇచ్చారు. తాజాగా సోమవారం మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు డీఎంను కలిశారు. దీంతో బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనంతరాములు, కె.నర్సింలు, ఎం.నర్సింలు, శంకరయ్య, సీహెచ్.రాజు, సీహెచ్.నర్సింలు, హైమద్, ఎస్.రాజు, ప్రశాంత్, కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి నక్షబాట కల్పించండి

- ఎమ్మెల్యే శంకర్‌కు చింతకుంటపల్లివాసుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: గ్రామాన్ని సర్వే చేయించి అధికారిక నక్షబాట ఇప్పించాలని సోమవారం కేశంపేట మండలంలోని చింతకుంటపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఈ మేరకు షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చింతకుంటపల్లి గ్రామంలో సుమారు 700 ఎకరాల భూమి ఉందన్నారు. కానీ గ్రామానికి నక్షబాట లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ శివారులో ఉన్న భూములను సమగ్ర సర్వే చేయించి నక్షబాట జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. రెవెన్యూ నక్షబాట లేకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను రెవెన్యూ శాఖ మంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీరేష్, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పెంటయ్య, అంజయ్య, మల్లేష్, శంకరయ్య, యాదయ్య, బాబర్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు

శంకర్‌పల్లి: పట్టణంలో రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో రాత్రి వేళల్లో కనిపించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడ్డారు. దీంతో సోమవారం పోలీసులు ట్రాఫిక్ సీఐ వెంకటేశం మొరం వేసి, పూడ్చి వేయించారు. దీంతో వాహనదారులు పోలీసులను అభినందిస్తున్నారు.


గుంతల్లో మట్టిని పోయిస్తున్న సీఐ వెంకటేశం